నమస్తే తెలంగాణ

ఖమ్మం

10 | ఖమ్మం, గురువారం 6 ఫిబ్రవరి 2025 | KHAMMAM

# ఓటమి భయంతోనే అక్రమ కేసులు

- పోలీసులు ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదు
- రైతుల పక్షాన నిలిచిన, గ్రామసభల్లో ప్రశ్నించిన వారిపై కేసులా?
- స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం
- విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రేగా కాంతారావు, చిత్రంలో మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్

ఇల్లెందు, ఫిబ్రవరి 5: స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓడిపోతామనే భయంతోనే కాంగ్రెస్ నాయకులు.. బీఆర్ఎస్ నాయకులపై అక్రమ కేసులు పెట్టిస్తున్నారని, పోలీసులు కూడా ఏకపక్షంగా వ్యవహరిస్తూ కేసులు నమోదు చేస్తున్నారని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు ఆరోపించారు. ఇల్లెందులోని ఓ ఫంక్షన్ హాల్‌లో మాజీ ఎమ్మెల్యే బానోతు హరిప్రియానాయక్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రేగా మాట్లాడారు. గత కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను ఇవ్వలేక ప్రభుత్వం ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నదన్నారు. ఇటీవల జరిగిన గ్రామసభల్లో పలు సమస్యలపై ప్రశ్నించిన బీఆర్ఎస్ నాయకులపై కేసులు పెట్టడం ఎంతవరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. ప్రజాదరణ ఉన్న నాయకులపై అట్రాసిటీ కేసులు పెడుతున్నారని, ఇటీవలి కాలంలో మణుగూరు, చంద్రుగొండ, ప్రస్తుతం టేకులపల్లి మండలంలో ఏ సంబంధం లేని బీఆర్ఎస్ నాయకులపై కేసులు నమోదు చేశారని మండిపడ్డారు. రైతుల పక్షాన నిలిచిన లక్కినేని సురేందర్‌రావుపై కేసు విషయంలో అధికారుల తీరు మరీ దారుణంగా ఉందన్నారు. అధికారం శాశ్వతం కాదని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అట్రాసిటీ కేసులే నమోదు కాలేదన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 14 నెలలు పూర్తయినా ఒక్క పథకం కూడా పూర్తిస్థాయిలో అమలు కాలేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ నాయకులకు ప్రజలు తప్పకుండా బుద్ధి చెబుతారని, బీఆర్ఎస్ పార్టీ నూరు శాతం సీట్లు గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో సీనియర్ నాయకులు దిండిగాల రాజేందర్, సిలివేరి సత్యనారాయణ, టేకులపల్లి మండల అధ్యక్షుడు బొమ్మెర్ల వరప్రసాద్‌గౌడ్, ఇల్లెందు మండల అధ్యక్షుడు శీలం రమేష్, నాయకులు పరుచూరి వెంకటేశ్వర్లు, ఎస్.రంగనాథ్, అజ్మీరా బావ్‌సింగ్, జాఫర్ హుస్సేన్, బోడ బాలునాయక్, ఖమ్మంపాటి రేణుక, లాల్‌సింగ్, జబ్బార్, గిన్నారపు రాజేష్, సాతల హరికృష్ణ, కాసాని హరిప్రసాద్, డేరంగుల పోశం, భూక్యా సురేష్, పుందూరి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# ‘పది’ విద్యార్థులు ప్రణాళికతో చదవాలి

## ఎన్నెస్పీ కెనాల్ ఉన్నత పాఠశాలను సందర్శించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



విద్యార్థులతో కలిసి మోటివేషన్ తరగతులు వింటున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఖమ్మం అర్బన్, ఫిబ్రవరి 5: పదో తరగతి విద్యార్థులు ప్రణాళికతో చదివి నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆకాంక్షించారు. నగరంలోని ఎన్నెస్పీ కెనాల్‌లో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన మోటివేషన్ తరగతులను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు రాబోయే నెల రోజులపాటు జాగ్రత్తగా ఉండాలని, ఆరోగ్యకరమైన ఆహారం మాత్రమే తీసుకోవాలని, జంక్ ఫుడ్, చిప్స్ తినొద్దన్నారు. పరీక్షల నేపథ్యంలో ప్రణాళికతో చదివి మంచి మార్కులు సాధించాలని, పాఠశాలకు, తల్లిదండ్రులకు పేరు తీసుకురావాలని సూచించారు. గొప్ప స్థాయికి చేరిన తర్వాత ఇతరులకు సహాయం చేయాలని పేర్కొన్నారు. మోటివేషన్ స్పీకర్ నాగేశ్వరరావు పిల్లలకు నిర్వహించిన తరగతిని కలెక్టర్ విద్యార్థులతో కలిసి కూర్చొని ఆసక్తిగా విన్నారు. కార్యక్రమంలో డీఈవో సోమశేఖర శర్మ, హెచ్ఎం రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# మెరుగైన వైద్య సేవలు అందించాలి

## పాల్వంచ సీహెచ్‌సీ తనిఖీలో కలెక్టర్ జితేశ్ వి పాటిల్



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

పాల్వంచ, ఫిబ్రవరి 5 : ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ వైద్యాధికారులను ఆదేశించారు. పాల్వంచ కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ)ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. మందులు అందించే గది, రక్త పరీక్ష కేంద్రం, ఇన్ పేషెంట్, గర్భిణుల వార్డు, మందులు నిల్వ చేసే స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. రోగులతో మాట్లాడి అందుతున్న వైద్య సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. ఔట్ పేషెంట్స్, సిబ్బంది, మందుల వివరాలపై ఆరా తీశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉండాలని సూచించారు. రోగుల తాకిడి నేపథ్యంలో ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు. ఔషధ నిల్వలు ముందస్తు స్టాక్ పెట్టుకోవాలని, రోగులకు బలవర్ధకమైన ఆహారం అందించాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తేవాలన్నారు. తనిఖీల్లో కలెక్టర్‌తోపాటు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ రాంప్రసాద్, డాక్టర్ శైలేష్, మోహన్ వంశీ, ప్రసాద్, రాంప్రసాద్, లావణ్య, నర్సింగ్ సూపరింటెండెంట్ సరళ, సిబ్బంది ఉన్నారు.

# గిరిజన మహిళలు ఆర్థికంగా ఎదగాలి

## భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్



యూనిట్‌ను పరిశీలిస్తున్న ఐటీడీఏ పీవో రాహుల్

దుమ్ముగూడెం, ఫిబ్రవరి 5: గిరిజన మహిళలు స్వశక్తితో కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని భద్రాచలం ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. లక్ష్మీనగరంలో గిరిజన చిక్కీ యూనిట్‌ను బుధవారం ఆయన పరిశీలించారు. పల్లిపట్టీ తయారు చేసే విధానం గురించి మహిళలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పీవో మాట్లాడుతూ ఏడుగురు గిరిజన మహిళలు రూ.24 లక్షల సబ్సిడీని సద్వినియోగం చేసుకొని రూ.40 లక్షల ఖర్చుతో చిక్కీ యూనిట్ నెలకొల్పడం గొప్ప విషయమన్నారు. నాణ్యమైన పల్లిపట్టీని తయారు చేసి ఆకర్షణీయంగా ప్యాకింగ్ చేసి సరసమైన ధరలకు అమ్ముకోవాలని సూచించారు.

### మొదటి అడుగు ‘పది’తోనే..

విద్యార్థులకు మొదటి అడుగు ప్రారంభమయ్యేది పదో తరగతితోనే అని, ఆ మార్కులతోనే భవిష్యత్ ఆధారపడి ఉంటుందని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. రేగుబల్లి బాలికల ఆశ్రమ పాఠశాలను బుధవారం సందర్శించిన ఆయన మెనూ ప్రకారం భోజనం అందుతుందా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. పదో తరగతి విద్యార్థినులతో ప్రత్యేకంగా సమావేశమై పరీక్షల్లో పాటించాల్సిన మెలకువలపై సూచనలు, సలహాలు చేశారు. పదో తరగతి వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. అనంతరం పీవో విద్యార్థినులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఏపీవో డేవిడ్‌రాజ్, డీడీ మణెమ్మ, ఏటీడీవో అశోక్‌కుమార్, ఎస్‌వో ఉదయ్‌భాస్కర్, తహసీల్దార్ మామిడి అశోక్‌కుమార్, హెచ్ఎం సావిత్రి, వార్డెన్ శారద తదితరులు పాల్గొన్నారు.

- కామారెడ్డి డిక్లరేషన్, ఎన్నికల హామీ అమలుచేసి తీరాల్సిందే..
- రిజర్వేషన్ల శాతాన్ని తగ్గిస్తే కాంగ్రెస్ ప్రభుత్వ భరతం పడతాం
- ఇచ్చిన మాట ప్రకారం రాజ్యాంగబద్ధంగానే రిజర్వేషన్లు కల్పించాలి
- ‘కేంద్ర ఆమోదం’ పేరుతో మెలిక పెడితే.. మేం రేవంత్ సర్కారుకు వాత పెడతాం..
- బీసీ కోటాలో కాంగ్రెస్ ప్రభుత్వ మోసంపై భగ్గుమన్న బహుజనులు
- ‘స్థానిక’ ఎన్నికల వేళ బీసీలకు ద్రోహం తలపెట్టిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వం

# 42 శాతం ఇవ్వాల్సిందే..



బీసీ కోటా అంశంలో కాంగ్రెస్ సర్కారు మోసాన్ని గుర్తించిన బహుజనులు భగ్గుమన్నారు. రిజర్వేషన్ల శాతాన్ని తగ్గిస్తే రేవంత్ ప్రభుత్వ భరతం పడతామంటూ హెచ్చరిస్తున్నారు. అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే బీసీ రిజర్వేషన్లను పెంచుతామని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ కోటాను 42 శాతానికి పెంచుతామని ఇచ్చిన ఎన్నికల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం తుంగలో తొక్కిందని ఆరోపించారు. కామారెడ్డి డిక్లరేషన్ పేరిట పచ్చి మోసానికి పాల్పడిందని దుయ్యబట్టారు. తాము అధికారంలోకి రాగానే బీసీ రిజర్వేషన్లను పెంచుతామంటూ ఎన్నికలకు ముందు ఊదరగొట్టిన కాంగ్రెస్.. ఇటీవల హడావిడిగా అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు పెట్టి బీసీ రిజర్వేషన్ల పెంపుపై తీర్మానం చేసి కేంద్రానికి పంపి చేతులు దులుపుకోవడంపై బహుజనులు మండిపడుతున్నారు. బీసీ రిజర్వేషన్ల పెంపు కోసమంటూ ఇటీవల చేపట్టిన కులగణన సర్వేను సమగ్రంగా నిర్వహించకపోవడం, సర్వే నివేదిక సమస్తం తప్పల తడకగా ఉండడం, అందులోనూ బీసీ జనాభా గణనీయంగా తగ్గిందని చెప్పడం, పైగా ఓసీ జనాభా అమాంతంగా పెరిగిందని చూపించడం వంటి చర్యలపై బహుజనులు, బీసీ సంఘాల నాయకులు భగ్గుమని మండిపడుతున్నారు. ఇచ్చిన హామీ ప్రకారం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాల్సిందేనని డిమాండ్ చేస్తున్నారు. తెలంగాణ అసెంబ్లీలో తీర్మానించి పంపిన బిల్లును కేంద్రం ఆమోదించాలంటూ మెలిక పెడితే తాము కూడా కాంగ్రెస్‌కు వాత పెడతామంటూ హెచ్చరిస్తున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ బీసీలకు ద్రోహం తలపెట్టిన రేవంత్ ప్రభుత్వానికి తగిన బుద్ధిచెప్పి తీరుతామంటూ స్పష్టం చేస్తున్నారు. బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ సర్కారు చేసిన మోసం గురించి బీసీ వర్గాల ప్రజలు, బహుజన సంఘాల నాయకుల అభిప్రాయాలు వారి మాటల్లోనే..

-ఖమ్మం, నమస్తే తెలంగాణ ప్రతినిధి/ భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ, ఫిబ్రవరి 5

### అధికారం కోసమే కామారెడ్డి డిక్లరేషన్..



ఎన్నికల్లో గెలిచి అధికారం చేపట్టడం కోసమే కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌ను ప్రకటించింది. కానీ అధికారంలోకి వచ్చాక దానిని విస్మరించింది. రాష్ట్రంలోని బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి. ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లోనూ ఇదే శాతంతో రిజర్వేషన్లు అమలు చేయాలి. పది శాతం ఈడబ్ల్యూఎస్ కోటాను కాపాడుకునేందుకు బీసీ రిజర్వేషన్లను తగ్గించారు. గతంతో పోలిస్తే సుమారు 25 లక్షల మంది బీసీలను సర్వేలో చూపించకపోవడమంటే కుట్ర చేయడమే.

–సంకుబాపన అనుదీప్, బీసీ నాయకుడు, కొత్తగూడెం

### కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకం లేదు..



2014 నాటి సమగ్ర కుటుంబ సర్వేలో 56 శాతంగా ఉన్న బీసీలు 2024 సర్వేలో 46 శాతానికి ఎలా తగ్గారో ప్రభుత్వం సమాధానం చెప్పాలి. ఎస్సీ, ఎస్టీ, బీసీలు తగ్గారని, ఓసీలు పెరిగారని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్న మాటలు నమ్మేలా లేవు. అసలు కాంగ్రెస్ ప్రభుత్వంపైనే నమ్మకం లేదు. అందుకే ఈ సర్వే నివేదికలను సాక్షాత్తూ కాంగ్రెస్ ఎమ్మెల్సీలు, నాయకులే తగులబెడుతున్నారు. రిజర్వేషన్ల పేరిట తాజాగా పెట్టిన అసెంబ్లీ ప్రత్యేక సమావేశాలు కూడా బీసీలను మభ్యపెట్టేందుకేనని అర్థమవుతూనే ఉంది.

–కూసన వీరభద్రం, కొత్తగూడెం

### తప్పులతడకగా కులగణన



కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహించిన కులగణన తప్పుడు తడకలుగా ఉంది. ఇటీవలి అసెంబ్లీ ప్రత్యేక సమావేశాల్లో రిజర్వేషన్లు పెంచితే బీసీలకు న్యాయం జరుగుతుందని అనుకున్నాం. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రమైన అన్యాయం చేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేను అప్పట్లో రేవంత్‌రెడ్డి తప్పుబట్టారు. తెలివున్న వాళ్లెవరూ సర్వేలో పాల్గొనబోరంటూ ప్రజల్ని తప్పుదోవ పట్టించారు. అదే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఇప్పుడు కులగణన చేపట్టి బీసీలు 46 శాతం మందే ఉన్నారంటూ చెబుతున్నారు.

–కాపు కృష్ణ, కొత్తగూడెం

### ఓసీ జనాభా శాతం గణనీయంగా పెరగడమేంటి?



రాష్ట్రంలో ఓసీ జనాభా శాతం ఒక్కసారిగా గణనీయంగా పెరగడమేంటనేది అనుమానాలకు తావిస్తోంది. అదే సమయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ జనాభా ఉన్నపళంగా ఎలా తగ్గుతుంది? అంటే ఇటీవల చేపట్టిన కులగణన సర్వే తప్పులతడకగా ఉన్నట్లే కదా? లోపభూయిష్టమైన సర్వే చేసి బీసీలను మభ్యపెట్టేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నిస్తోంది. 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు కేంద్రం ఆమోదం కావాలని చెప్పడమంటే బీసీలను కచ్చితంగా మోసం చేయడమే అవుతుంది.

–మూడ్ జయరాంనాయక్, బీఆర్ఎస్ నాయకుడు

### కులగణన సర్వే సమగ్రంగా జరగలేదు..



బీసీల రిజర్వేషన్ల అమలు కోసం రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇటీవల చేపట్టిన కులగణన సర్వే సమగ్రంగా జరగలేదని స్పష్టంగా అర్థమవుతోంది. గతంలో అధిక శాతంగా ఉన్న బీసీలు ఇప్పుడు అత్యధికంగా తగ్గినట్లు ఈ సర్వే చెబుతుండడమే ఇందుకు నిదర్శనంగా కన్పిస్తోంది. ఇటీవలి అసెంబ్లీలో రేవంత్ ప్రభుత్వం చెప్పినవి.. సర్వే గణాంకాల మాదిరిగా లేవు. కాంగ్రెస్ పార్టీ చెప్పిన లెక్కల మాదిరిగా ఉన్నాయి. బీసీల సంఖ్య పెరగడం కాంగ్రెస్ ప్రభుత్వం ఇష్టం లేనట్లుగా ఉంది. అందుకే జనాభా శాతాన్ని తక్కువగా చూపి బీసీలకు అన్యాయం చేస్తోంది.

–మల్లెల శ్రీరామ్మూర్తి, బీఆర్ఎస్ నాయకుడు, పాల్వంచ

### సీఎం రేవంత్‌రెడ్డి.. బీసీల వ్యతిరేకి



ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. కచ్చితంగా బీసీల వ్యతిరేకి. తప్పుడు వాగ్దానాలతో అధికారంలోకి వచ్చిన ఆయన.. తెలంగాణలోని బీసీలందరినీ మరోసారి మోసం చేశారు. కులగణన పేరుతో బీసీల జనాభాను లెక్కిస్తామని చెప్పారు. కానీ పూర్తిస్థాయిలో సర్వే చేయకుండానే బీసీలు తగ్గారని చెబుతున్నారు. సాక్షాత్తూ కాంగ్రెస్‌కు చెందిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఈ సర్వేను ఆక్షేపించారు. దానిని చిత్తు కాగితంలా అభివర్ణించి కాల్చివేసి నిరసన తెలిపారు. బీసీలకు రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ చెబుతున్న ఈ మాటలు ఏపాటికి నిజమైనవో ఈ ఘటనల ద్వారా ప్రజలు గమనిస్తూనే ఉన్నారు.

–బచ్చు విజయ్‌కుమార్, సుడా మాజీ చైర్మన్

### బీసీ కులాలకు తీరని నష్టం..



రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులాలను మోసం చేసేందుకు కంకణం కట్టుకున్నట్లుగా కన్పిస్తోంది. తాజా కులగణనతో తీసుకొచ్చే రిజర్వేషన్లు బీసీ కులాలకు తీరని నష్టాన్ని తెచ్చిపెట్టేలా ఉన్నాయి. కులగణన సమగ్రంగా చేపట్టలేదు. సర్వే నివేదిక మొత్తం తప్పులతడకగా ఉంది. గత కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేకు, తాజాగా కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సర్వేకు ఎంతో వ్యత్యాసం ఉంది. తాజా సర్వేలో బీసీలు ఇంత పెద్ద సంఖ్యలో తగ్గడమేంటనేది అనుమానాలకు తావిస్తోంది. సుమారు 40 లక్షల మంది ఈ సర్వేలో పాల్గొనలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డే చెబుతున్నారు. మరి ఏ లెక్కన రిజర్వేషన్లపై తీర్మానం చేశారు?

–చిత్తారు నాగేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్, మధిర

# రెండో రోజూ బీఆర్ఎస్ నేతల అరెస్టులు

- భద్రాద్రి జిల్లాలో ఇళ్లలోకి వెళ్లి అక్రమంగా అదుపులోకి తీసుకున్న పోలీసులు
- బీసీ రిజర్వేషన్ల నేపథ్యంలో అసెంబ్లీని ముట్టడిస్తారనే అనుమానంతో అరెస్టులు



లక్ష్మీదేవిపల్లి : పోలీస్ స్టేషన్‌లో ఉన్న కొట్టి వెంకటేశ్వర్లు




అశ్వారావుపేట: పోలీసుల అదుపులో బీఆర్ఎస్ నాయకులు

అశ్వారావుపేట/ లక్ష్మీదేవిపల్లి, ఫిబ్రవరి 5: బీసీ రిజర్వేషన్లపై తీర్మానం చేసిన నేపథ్యంలో అసెంబ్లీని ముట్టడిస్తారనే అనుమానంతో భద్రాద్రి జిల్లాలోని బీఆర్ఎస్ నాయకులను కాంగ్రెస్ ప్రభుత్వం రెండో రోజు బుధవారమూ అరెస్టు చేయించింది. ప్రభుత్వ ఆదేశాలతో రంగంలోకి దిగిన పోలీసులు.. ఆయా మండలాల్లో బీఆర్ఎస్ నాయకుల ఇళ్ల వద్దకు వెళ్లారు. ఇళ్లలో ఉన్న నాయకులకు కారణాలు కూడా చెప్పకుండా అక్రమంగా అదుపులోకి తీసుకొని మరీ పోలీసుస్టేషన్లకు తరలించారు. బీఆర్ఎస్ లక్ష్మీదేవిపల్లి మండల అధ్యక్షుడు కొట్టి వెంకటేశ్వరరావును అరెస్టు చేసి పీఎస్‌కు తీసుకెళ్లారు. ఇక, అశ్వారావుపేట మండలంలోనూ అరెస్టులు కొనసాగాయి. ఇక్కడ బీసీ రిజర్వేషన్ల ఆందోళనలతోపాటు పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచ్‌లు చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమాన్ని కూడా పరిగణనలోకి తీసుకున్నారు. మాజీ సర్పంచ్‌ల ఆందోళనతో సంబంధం లేని బీఆర్ఎస్ నేతలను కూడా నిర్బంధించారు. అశ్వారావుపేటలో మాజీ సర్పంచ్‌లు నారం రాజశేఖర్, కలపాల దుర్గయ్య, సోనీ శివశంకర్ వరప్రసాద్‌లతోపాటు బీఆర్ఎస్ నాయకులు సత్యవరపు సంపూర్ణ మోటూరి మోహన్, చరణ్‌లను అరెస్ట్ చేశారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. కాగా, బీఆర్ఎస్ నాయకుల అరెస్టును ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి యూఎస్ ప్రకాశ్‌రావు తీవ్రంగా ఖండించారు.

# ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ..

- ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేసిన మాలమహానాడు నేతలు
- శాసన మండలిలో వర్గీకరణ బిల్లు ఆపాలని డిమాండ్



చంద్రుగొండలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న మాలమహానాడు కార్యకర్తలు

చంద్రుగొండ, ఫిబ్రవరి 5: ఎస్సీల వర్గీకరణను నిరసిస్తూ మాల మహానాడు మండల కమిటీ ఆధ్వర్యంలో చంద్రుగొండ మండల కేంద్రంలో రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను బుధవారం దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాల మహానాడు నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న కొలమానం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వం ఆర్ఎస్ఎస్, బీజేపీ నాయకుల చెప్పుచేతల్లో నడుస్తున్నదని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణపై కాంగ్రెస్ ప్రభుత్వం దూకుడుగా వెళ్లడం సరికాదని, శాసన మండలిలో వర్గీకరణ బిల్లు ఆపాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో మాల మహానాడు ఆధ్వర్యంలో మిలిటెంట్ పోరాటాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం మండల నాయకులు తలారి నాగరాజు, తంగెళ్ల మంగయ్య, బడుగు గణేశ్, పోతురాజు రాజరావు, ఎలమందల లక్ష్మణ్, దాసరి వెంకటేశ్, దాసరి క్రాంతి, అల్లి రవీంద్ర, రాయి రాజా, బేతి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# 22 ఎంపీటీసీలు, ఒక జడ్పీటీసీ

- భద్రాద్రి జిల్లాలో పెరిగిన స్థానాలు
- భద్రాచలం మండల పరిషత్ కావడంతో మారిన ముఖచిత్రం
- కొత్తగా పెరిగిన స్థానాలతోనే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ




కొత్తగా ఏర్పాటైన భద్రాచలం మండల పరిషత్ కార్యాలయం

భద్రాద్రి కొత్తగూడెం, ఫిబ్రవరి 5 (నమస్తే తెలంగాణ): స్థానిక సంస్థల ఎన్నికలకు సన్నద్ధమవుతున్న వేళ జిల్లాలోని ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల్లో మార్పులు చేర్పులు చోటు చేసుకుంటున్నాయి. కొత్తగా భద్రాచలం మండల పరిషత్‌గా ఆవిర్భవించడంతో ముఖచిత్రం మారిపోయింది. పంచాయతీ రాజ్ యాక్ట్ ప్రకారం ప్రతీ మండలానికి ఐదు ఎంపీటీసీ స్థానాలు ఉండాలనే నిబంధనతో అధికారులు కొత్త స్థానాలపై కసరత్తు చేశారు. గత ఏడాది ఎంపీటీసీ, జడ్పీటీసీ పదవీ కాలం ముగియడంతో ప్రభుత్వం ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నది. నోటిఫికేషన్ వచ్చే నాటికి ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాల వివరాలను ప్రభుత్వానికి నివేదించాలి. ఈ క్రమంలో అధికారులు జిల్లావ్యాప్తంగా జనాభా ప్రాతిపదికన ఎంపీటీసీల స్థానాల పెంపుదల ప్రక్రియను పూర్తి చేశారు. కొత్తగా ఒక జడ్పీ స్థానం కూడా వచ్చి చేరింది.

### కొత్త మండల పరిషత్‌గా భద్రాచలం..

జిల్లాలో 2019లో జరిగిన మండల పరిషత్ ఎన్నికల్లో ఎంపీటీసీలు 220 మంది ఉండగా.. 21 జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. భద్రాచలం మండల పరిధిలోని పలు గ్రామాలు ఏపీ రాష్ట్రంలో విలీనం కావడంతో మండల స్వరూపం మారిపోయింది. కేవలం భద్రాచలం పట్టణం మాత్రమే మిగలడంతో మండల పరిషత్‌ను రద్దు చేశారు. దీంతో భద్రాచలం గ్రామపంచాయతీగానే మిగిలిపోయింది. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం భద్రాచలం పట్టణాన్ని మండలంగా మార్చడంతో ఈసారి పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలకు ఎన్నికల జరుగనున్నాయి. ఇప్పటివరకు 21 మండలాలుగా ఉన్న భద్రాద్రి జిల్లా 22 మండలాలతో ముఖచిత్రం మారబోతున్నది. భద్రాచలం, సారపాకను మున్సిపాలిటీగా మార్చే ప్రతిపాదన కూడా తెరపైకి రావడంతో బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక పంచాయతీకి కూడా ఎన్నికలు నిర్వహించలేదు. ప్రస్తుతానికి భద్రాచలంతోపాటు సారపాకకు కూడా ఎన్నికలు జరగనుండడంతో ఇక్కడ పెరిగిన 6 ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నారు.

### ఒకచోట పెరిగి.. మరోచోట తగ్గి..

త్వరలో జరగబోతున్న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల కోసం సభ్యుల స్థానాలు ఒకచోట పెరిగి.. మరోచోట తగ్గాయి. భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మున్సిపాలిటీగా మారడంతో అక్కడ 6 ఎంపీటీసీ స్థానాలను కుదించాల్సి వచ్చింది. పంచాయతీరాజ్ యాక్ట్ ప్రకారం మండలానికి 5 ఎంపీటీసీ స్థానాలు తప్పనిసరిగా ఉండాలనే నిబంధన వల్ల కొన్ని మండలాల్లో కరకగూడెం 1, బూర్గంపాడు 6, భద్రాచలం 14, ఆళ్లపల్లి 1 ఎంపీటీసీ స్థానాలు పెరిగాయి. దీంతోపాటు భద్రాచలం జడ్పీటీసీ స్థానం కూడా అదనంగా పెరగనున్నది. ఇప్పటివరకు జిల్లాలో 21 జడ్పీటీసీ స్థానాలు ఉండగా.. కొత్తగా మరో స్థానం పెరగడంతో ఆ సంఖ్య 22కు చేరింది.

### జనాభా లెక్కల ప్రకారం పెరిగిన స్థానాలు



పంచాయతీరాజ్ యాక్ట్ ప్రకారం ప్రతీ మండలానికి ఐదు ఎంపీటీసీ స్థానాలు ఉండాలి. దీనివల్ల కొన్ని మండలాల్లో స్థానాలు పెరిగాయి. భద్రాచలం మండల పరిషత్ కావడంతో అదనంగా 22 ఎంపీటీసీ స్థానాలు పెరిగాయి. ఒక జడ్పీటీసీ స్థానం కూడా పెరిగింది. ఎన్నికలు ఎప్పుడొచ్చినా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నాం.

–నాగలక్ష్మి, జడ్పీ సీఈవో